క్లుప్తంగా

పలు గ్రామాల్లో స్వామిత్వ సర్వే



కాలేరులో స్వామిత్వ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో స్వామిత్వ సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. కాలేరు, మాచర తదితర గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు సర్వేలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లోని నివాసాలను సర్వేయర్లచే కొలతలు, హద్దులను సేకరించారు. వాటిని ఆన్‌లైన్ చేసే పనిలో సంబంధిత సిబ్బంది నిమగ్నమయ్యారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఆయా గ్రామాల అధికారులు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న దాత, వైద్యాధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీలలో గర్భిణులకు శనివారం ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. పలువురు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. అంగర పీహెచ్‌సీలో 32 మంది గర్భిణులను సీనియర్ గైకాలజిస్ట్ కన్యా కుమారి పరీక్షించారు. ఆరుగురుని హై రిస్క్‌గా గుర్తించారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావు గర్భిణులకు బిస్కెట్లు, ఆపిల్ జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా వేంకటేశ్వర స్వామి ఆలయాలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం సందడిగా మారాయి. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి దర్శనానికి పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు బాల బాలాజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. టేకి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఆలయంలో గ్రామానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అంగరలో ఆలయ నిర్వాహక కమిటీ, దాతల సహకారంతో దూరపు ప్రాంతాల భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యానాంకు చెందిన రైతు రెడ్డి సుబ్బారాయుడు తన బైక్‌పై ద్రాక్షారామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్ బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో సుబ్బారాయుడు గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాల పాలైన అతడిని యానం ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ నాయకుల నిరసన

కె.గంగవరం: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కె.గంగవరం సెంటర్లో శనివారం టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై జానీ బాషా తన సిబ్బంది వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

మండపేటలో..

మండపేట: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ ముఖ్య నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వేగుళ్ల ఇంటికి చేరు కోగా వారితో కలిసి ఆయన కేపీ రోడ్డుపై బైఠాయించారు. చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎంత చెప్పినా వినిపించుకోకపోవడంతో ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో విడిచిపెట్టారు.

నేడు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం ప్రారంభం

ఆలమూరు: స్థానిక మెయిన్‌రోడ్డులో సుమారు రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ) భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించనున్నారన్నారు.

సాకారమవుతున్న సొంతింటి కల

- నిరుపేదలకు స్థిరాస్తి భరోసా
- ఒక్కో ఇంటి విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రామచంద్రపురం రూరల్: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రామచంద్రపురం అర్బన్, రామచంద్రపురం రూరల్ మండలాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. మండల పరిధిలో 195 ఎకరాలు సేకరించి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ప్రారంభంలో భాగంగా 4748 మందికి, అనంతరం వివిధ దశల్లో దరఖాస్తు చేసుకున్న మరో 419 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. ప్రైవేట్ లే అవుట్లకు దీటుగా జగనన్న కాలనీ లే అవుట్లను తీర్చిదిద్దారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ ఇళ్ల నిర్మాణం వేగవంతానికి కృషి చేస్తున్నారు.

నిర్మాణ పనుల్లో అండదండగా

ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల ఆర్థికసాయం మంజూరుకే పరిమితం కాకుండా ఇంటి నిర్మాణంలో వారికి అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది. లే అవుట్ల వద్ద నీటి వసతిని కల్పించింది. విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు అదనంగా రూ.35,000 రుణసాయాన్ని అందిస్తోంది. సబ్సిడీపై ఐరన్, సిమెంట్ అందించడంతో పాటు ఇసుకను ఉచితంగా అందజేస్తోంది.

నిరుపేదలకు స్థిరాస్తి భరోసా..

జగనన్న కాలనీల్లో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, కమ్యూనిటీ హాళ్లు తదితర వసతులు కల్పిస్తోంది. ఆయా పనులు పూర్తయితే కాలనీలోని ఒక్కో ఇల్లు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు విలువ చేస్తుందని అధికారులు అంటున్నారు. ఈ మేరకు నిరుపేదల బతుకులకు భరోసానిస్తూ స్థిరాస్తి సమకూరుతోంది.



వెలంపాలెంలో ప్రధాన రహదారిని ఆనుకుని రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీ

మండలం	మంజూరైన ఇళ్లు	పునాది దశ	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయినవి
రామచంద్రపురం అర్బన్	1945	380	1248	317
రామచంద్రపురం రూరల్	2549	592	1177	780

సొంతింటి కల నెరవేరింది



ఇంటి స్థలం కోసం గతంలో ఎన్నోసార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్న ఫలితం లేదు. వలంటీరే మా వద్దకు వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. స్థలంతో పాటు ప్రభుత్వ సాయంతో సొంతింటి కలను నెరవేర్చుకున్నాం.

– బడుగంటి సునీత, నరసాపురపుపేట

ఇంటిని నిర్మించుకుంటున్నాం..



ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంటిలో నివసిస్తున్నాం. జగన్ సర్ వచ్చాక ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వ సాయంతో ఇంటిని నిర్మించుకుంటున్నాం. అధికారులు నిర్మాణ పనుల్లో అన్ని విధాలా సహకరిస్తున్నారు.

– గీసాల భార్గవి, ఏరుపల్లి

ప్రభుత్వ సహకారంతో జీవితాలకు భరోసా..



తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాకు ఇద్దరు కొడుకులు ప్రభుత్వ సహకారంతో పెద్ద కొడుకు యాని మేషన్ కోర్సు చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కొడుకు ఇంజినీరింగ్ చదువుకుంటున్నాడు. సొంతింటి కల నెరవేరింది. జగన్నాయకులపాలెం లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం దగ్గరదగ్గరగా పూర్తి కావొస్తోంది. జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– గుబ్బల సూరిబాబు, తాళ్లపాలెం

అన్ని శాఖల అధికారుల సహకారం



ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అన్ని శాఖల అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. మంత్రి వేణు సూచనల మేరకు హౌసింగ్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల అధికారులు అందరూ ఇళ్లు నిర్మించుకునేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పేదలు ఇళ్లు నిర్మించుకునేలా చూస్తాం.

– ఎస్.షెలత్‌రాజు, ఎంపీడీఓ, రామచంద్రపురం

అభివృద్ధి పనులకు భూమిపూజ



సోమేశ్వరంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ఆరిఫ్ తదితరులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ ఆరిఫ్ శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులు రూ.10.50 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరిఫ్ భూమి పూజ చేశారు. గ్రామంలోని చింతపల్లి శ్రీనివాస్ ఇంటి నుంచి కంచర్ల సత్యవతి ఇంటి వరకు, అలాగే సవరల వీరన్న ఇంటి నుంచి శాకా శ్రీను ఇంటి వరకు నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు, సోమేశ్వరం శివారు సీతంపేటలో రూ.7.50 లక్షలతో రుద్రభూమిలో నిర్మించనున్న షెడ్డు, స్నానఘట్టం నిర్మాణ పనులకు సర్పంచ్ ఆరిఫ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ (బుజ్జి), సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలతోడు అభివృద్ధికి అండగా ఉంటా



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రూ. 1.36 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు

మండపేట: పాలతోడు గ్రామాన్ని దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కరించడం ద్వారా గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పంచాయతీ సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతుల అధ్యక్షతన రూ.1.36 కోట్ల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్సీ తోట ప్రారంభోత్సవాలు, భూమి పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ ఏరియా, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్సీ తోట స్థానికులతో మమేకమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎమ్మెల్సీ తోట అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ. రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్‌లతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ డ్రైన్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. దీర్ఘకాలం నాటి డ్రైనేజీ సమస్యకు త్వరలో తెరపడనుండడం పట్ల కాలనీవాసులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దన్నరం కాల తర్వాత గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి మోక్షం కలిగిందని, రూ.28 లక్షలతో అప్రోచ్ రోడ్డు, కాలనీలో అంతర్గత రోడ్లు, కల్వర్టులు నిర్మాణం చేశామని మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు వివరించారు.

పిల్లా సూరిబాబుకు పరామర్శ

ఇటీవల అపెంటిసైటిస్ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పిల్లా సూరిబాబును ఎమ్మెల్సీ తోట పరామర్శించారు. ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజులు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గంగరాజుల దేవి, ఉప సర్పంచులు తులా శేషారావు, గుత్తుల సూర్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తోరం శ్రీనివాస్, తుమ్మా వీరబాబు, ఏలేటి విశ్వనాథం, పిల్లెల్లి పోతురాజు, పెయ్యల వెంకన్న, పైడిమళ్ల రాముడు, మందపల్లి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి చెల్లుబోయిన వేణు తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కూళ్ల గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి చెల్లుబోయిన వేణు శిలాఫలకాన్ని ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామానికి 10 మందిని ఉద్యోగులను నియమించడం, వారికి తోడు పరిపాలన సులభం కావడం కోసం, ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లేందుకు 26 మంది వలంటీర్లను నియమించారన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఏదైనా పథకం కావాలన్నా, పింఛన్లు కావాలన్నా అధికారుల చుట్టూ, పంచాయతీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని కానీ సీఎం జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని పింఛన్ ఠంఛన్‌గా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే అందున్నాయని పేర్కొన్నారు. జగనన్న సురక్ష, విద్యా దీవెన, విద్యా కానుక, అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న తోడు, చేయూత వంటి పలు పథకాల ద్వారా గ్రామానికి నాలుగేళ్లలో రూ.30 కోట్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడైనా ఇంటి పథకాలు అందాయా? అని ప్రశ్నించారు.

నూతన పింఛన్ల పంపిణీ

గ్రామంలో నూతనంగా మంజూరైన 26 పింఛన్లను మంత్రి చెల్లుబోయిన వేణు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ రావాలంటే ఎవరైనా పింఛనుదారుడు చనిపోతే మరొకరికి పింఛన్ వచ్చేదన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో అర్హత ఉంటే ప్రతి నెలా నూతన పింఛన్లు పొందుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్ సొమ్మును రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతున్నారని గుర్తు చేశారు. ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షులు బాలాజీ, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిదరాజు, మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్రాంతి భవనానికి శంకుస్థాపన



ద్రాక్షారామ ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న మత గురువులు, ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండల ప్రజాపరిషత్ నిధుల నుంచి మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా (బాబ్జీ)కి కేటాయించిన రూ.5 లక్షలతో ద్రాక్షారామ బరియల్ గ్రౌండ్‌లో నిర్మించనున్న విశ్రాంతి భవన నిర్మాణానికి శనివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. హామియో జబ్బాన్ అంజుమనే ఇస్లాం బరియల్ గ్రౌండ్ కమిటీ ఆధ్వర్యంలో ముందుగా ముస్లిం మత గురువులు మీర్జా అస్కరి హుస్సేన్, మొహమ్మద్ గుల్ఫ రజాఆలం, మొహమ్మద్ తసదుక్ హుస్సేన్‌లు పార్థనలు చేశారు. అనంతరం ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి ఎండీ జాఫర్‌హుస్సేన్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు డేగల వెంకటరమణ తదితరులు శంకుస్థాపనలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 721 కేసుల పరిష్కారం



కోర్టుల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్

రామచంద్రపురం: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రపురం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 721 కేసులు పరిష్కరించారు.ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో 2 బెంచ్‌లు ఏర్పాటు చేయగా మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవిదేవి, బెంచ్ మెంబర్‌గా పీవీఎస్ జానకి, 2వ బెంచ్‌లో జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్, బెంచ్ మెంబర్ పి సత్యనారాయణలు నిర్వహించారు. మొత్తం రూ.1,90,88,693 విలువైన మొత్తం 721 కేసులు పరిష్కరించగా సివిల్ కేసులు 17, క్రిమినల్ కేసులు 695, బీఎస్ఎన్ఎల్, పీఎల్‌సీ కేసులు 9 పరిష్కరించారు.

చవితి ఉత్సవాలకు శ్రీకారం

అంబాజీపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శనివారం పందిరిరాట ముహూర్తం చేశారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో బాలగణపతి మందిరం వద్ద పందిరిరాటను పాతి ప్రత్యేక పూజలు చేశారు.

అనారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అనారోగ్యంగా ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. గంగలకు ర్రు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులు శుభ్ర పరుచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉంటామన్నారు. జ్వరం, తలనొప్పి, విరేచనాలు తదితర బాధలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి రావాలన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బి.అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీ నిస్సీ, ఎంపీహెచ్ఏ ప్రసాద్, ఏఎన్ఎం పి.మాధవీరాణి, ఆశా, వసతి గృహ వార్డెన్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గజ్జె పూజోత్సవం



నటరాజస్వామి గజ్జె పూజోత్సవంలో చిన్నారులు

మండపేట: ట్టణంలోని బురగుంట చెరువు వద్ద గల సీతారామక్షేత్రంలో శనివారం నాట్యకళా విద్యార్థులతో నటరాజ స్వామివారి గజ్జె పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోకిలవాణి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాట్య గురువు నాదశ్రీ చిన్నారులతో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. కోకిలవాణి కళాక్షేత్రం గురువు కేఆర్‌కేవీఎస్ రాజు మాట్లాడుతూ నాట్య విద్యార్థులకు గజ్జె పూజ ముఖ్య ఘట్టమన్నారు. నాట్య కళను ప్రోత్సహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఎంతో సహకారం అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం గణేశ్వరరావు చేతుల మీదుగా చిన్నారులకు గజ్జెలు బహూకరించారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. చింతలూరు, నర్సిపూడి, గుమ్మిలేరు, సంధిపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

అసంపూర్తి నిర్మాణానికి మోక్షమెప్పుడో?



తణుకువాడలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం

కాజులూరు: మండలంలోని తణుకువాడలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. 2006లో గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవటంతో సిబ్బంది అద్దె భవనంలో విధులు నిర్వహించేవారు. దీంతో నూతన భవన నిర్మాణానికి గానూ అప్పటి ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యాలయానికి జిల్లా పరిషత్ నుంచి రూ.ఐదు లక్షలు మంజూరు చేయించి పీఏసీఎస్ కార్యాలయం సమీపాన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే నిధులు సక్రమంగా విడుదల కాకపోవటంతో భవన నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆపై గత ఐదేళ్ల క్రితం పంచాయతీ కార్యాలయానికి కొత్తగా నిధులు మంజూరవగా గ్రామంలోని పీహెచ్‌సీ సబ్ సెంటర్ ఆవరణలో మరో నూతన కార్యాలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయం అందులో కొనసాగుతుంది. అయితే గతంలో పీఏసీఎస్ ఆవరణలో నిర్మించతలపెట్టిన అసంపూర్తి భవనాన్ని పూర్తిచేయక పోవటంతో అది క్రమేపీ శిథిలమౌతుంది. పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు, విషకీటకాలు సంచరిస్తుండటంతో పరిసర గృహవాసాల వారు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అంగన్‌వాడీ సెంటర్ లేదా మరో ప్రభుత్వ సంబంధిత కార్యాక్రమాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.



2006లో అప్పటి ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం